ప్రజాశక్తి
సోమవారం 14 ఏప్రిల్ 2025

నేడు బిఆర్ అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

భారత రాజ్యాగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళితో కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఎస్‌సి నాయకులు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పథకాలు కింద మంజూరు పత్రాలు, ఆస్తుల పంపిణీ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

జీడికి గిట్టుబాటు ధర అరణ్యరోదనే

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజనుల వద్ద వ్యాపారులు కొనుగోలు చేసిన జీడిపిక్కల బస్తాలు

- గిరిజనులను మభ్యపెడుతున్న ఐటిడిఎ
- జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటంటూ కట్టుకథ
- విడివికెలకు శిక్షణ పేరుతో కహానీలు
- వ్యాపారుల వలలో నలిగిపోతున్న గిరిజన రైతులు

జీడి పిక్కల కు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గత మూడు నెలలుగా చేపట్టిన ఆందోళనలు అరణ్యరోదనగానే మిగిలాయి. ఈ ఏడాది జనవరి నుంచి జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు కోరుతున్నారు. ఆందోళన, ధర్నాలు చేసినప్పుడల్లా ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్ జీడి పిక్కల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని చెపుతూ కాలక్షేపం చేశారు. వన్ దన్ వికాస కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని, విడివికెల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కహానీలు చెప్పారు. పార్వతీపురం మార్కెట్ యార్డులో జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామంటూ కట్టుకథ చెప్పుకొచ్చారు. గత నెలరోజులుగా జిల్లాలో జీడి పిక్కల కొనుగోళ్లు జరుగుతున్నాయి. గిరిజనులు సేకరించిన జీడి పిక్కలను ఎక్కువ కాలం ఇళ్లల్లో నిల్వ చేసుకోలేక అవసరాలకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు. ఐడిడిఎ ఆధ్వర్యాన విడివికెలు జీడిపిక్కలు కొనుగోలు చేస్తాయని ఎదురు చూసిన గిరిజన రైతులకు నిరాశే మిగిలింది. కిలో జీడి పిక్కలను 200 రూపాయలకు కొనుగోలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు డిమాండ్ చేశారు. కొనుగోలు సీజన్ ప్రారంభమైనా ఇంతవరకు విడివికెల ద్వారా కొనుగోలుకు సంబంధించి ఎలాంటి అతీగతీ లేదు. దీంతో గిరిజనులు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే గిరిజనులు సేకరించిన జీడి పిక్కలల్లో 60శాతం ప్రయివేటు వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయింది.

కిలో జీడి పిక్కల ధర 150రూపాయలే

జిల్లాలో ప్రయివేటు వ్యాపారులు కారుచౌకగా జీడిపిక్కలు కొనుగోలు చేస్తున్నారు. కిలో జీడి పిక్కలను రూ.150 నుంచి రూ.160కు కొనుగోలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. సరుకు నాణ్యతని బట్టి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని 8 గిరిజన మండలాల్లో సుమారు 60వేల ఎకరాల్లో జీడితోటల సాగు జరుగుతోంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు, దిగుబడి పెంచేందుకు ఐటిడిఎ ఉద్యానవన అధికారులు తగిన సాయం చేయకపోవడంతో 50శాతమే దిగుబడి జరిగినట్లు తెలుస్తోంది. కిలో జీడి పిక్కలను రూ.200కు కొనుగోలు చేయాలన్న గిరిజనుల డిమాండ్ అందని ద్రాక్ష లా మిగులుతోంది.

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు పై కట్టుకథ

ఇదిగో జీడి పిక్కలు విడివికెల ద్వారా కొనుగోలు చేస్తున్నాం, అదిగో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామంటూ ఇంతవరకు అధికారులు కట్టుకథలు చెప్పి గిరిజనులను మభ్యపెట్టారనే వాదనలు వినిపిస్తున్నాయి. విడివికె సభ్యులకు జీడి పిక్కలు, చింతపండు కొనుగోలుపై అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలు సాలూరు, కురుపాం, పార్వతీపురం కేంద్రాల్లో నిర్వహించారు. కొనుగోలు సీజన్ ముగుస్తున్నంత వరకు అధికారులు కాలయాపన చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

గిరిజనులను మోసగిస్తున్న ఐటిడిఎ

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఐటిడిఎ అధికారులు చెపుతూ కాలయాపన చేస్తుండడం గిరిజనులను మోసం చేయడమే. ఇప్పటికే 60 శాతం జీడి పిక్కలను గిరిజనులు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించారు. కిలో జీడి పిక్కలు రూ.150 నుంచి రూ.160కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

కొల్లి గంగు నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి

తూతూ మంత్రంగా బిటి రోడ్డు పనులు

అధికారుల పర్యవేక్షణా లోపమా? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా ?
వేసిన రెండు వారాలకే ఎక్కడికి అక్కడ పెచ్చులు ఊడిన రహదారి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి గిరి శిఖర గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి గిరిజన గ్రామాల ప్రజలకు డోలి మోతలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక నిధులను విడుదల చేసి రోడ్లు మంజూరు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలోకి వచ్చేసరికి రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత డొల్లతనం తేటతెల్లమవుతుంది. రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా రోడ్డు పనులు చేస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. రోడ్డు పనుల నాసిరకానికి నిదర్శనం మండలంలోని జి.శివడ పంచాయితీలో గల అంటిజోల రోడ్డే. ఈ గ్రామం నుంచి మణిగి గ్రామానికి 2.3 కిలోమీటర్ల బిటి రోడ్డును మార్చి నెలాఖరుకు పూర్తి చేశారు. అంత వరకు బాగానే ఉన్నప్పటికీ రోడ్డు వేసిన రెండు వారాలకే ఎక్కడికక్కడ ముక్క ముక్కలుగా పెచ్చులూడిపోయి అధ్వానంగా తయారైంది. ఈ సందర్భంగా స్థానిక గిరిజన గ్రామాల ప్రజలు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ వేసిన బిటి రోడ్డు ఉల్లిపొర దళసరితో వేస్తున్నారని, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటే ఎక్కడికి అక్కడ పెచ్చుపెచ్చులూడిపోవడంతో రోడ్డు వేసిన రెండు వారాలకే ఇలా మారితే కనీసం 6 నెలలు అయితే పూర్తిగా బిటి రోడ్డు కనిపించే దాఖలు ఉండవని విమర్శిస్తున్నారు. ఇంత దారుణంగా, నిర్లక్ష్యంగా నాణ్యత లేకుండా బిటి రోడ్లను కాంట్రాక్టులు వేస్తుంటే అధికారులు కనీసం పని వద్దకు వచ్చి నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడంలో దారుణమన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే రోడ్డు ఇలా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులంటే అధికారులకు అంత చులకనగా ఉందని, ప్రభుత్వం గిరిజన ప్రజలకు ప్రాధాన్యతిస్తున్న నిధులు కేటాయిస్తూ రహదారి సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ వాటిని సద్వినియోగం చేయకుండా అధికారులు మాత్రం తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నాణ్యతతో కూడిన బీటీ రోడ్డును వేయించేలా చూడాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా రోడ్డు నాణ్యత విషయమై పంచాయతీరాజ్ జెఇ పి.నాగేశ్వరరావును 'ప్రజాశక్తి' వివరణ కోరగా, రోడ్డు పెచ్చులూడిన విషయం తనకు తెలియదని సమాచారం ఇచ్చారు.

ఊడిపోయిన పెచ్చులను చూపిస్తున్న గిరిజన యువకుడు ఆరిక గంగారావు

అధికారుల నిర్లక్ష్యంతో నాణ్యతలేని బిటి రోడ్డు

బిటి రోడ్డు నిర్మాణపనులు జరుగుతున్న సమయంలో కనీసం అధికారులు వచ్చి పర్యవేక్షించిన దాఖలా లేకపోవడంతో కాంట్రాక్టర్లు వారికి నచ్చినట్టుగా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇస్తానుసారంగా వేయడం వల్ల వేసిన రెండు వారాలకే ఎక్కడకి అక్కడ రోడ్డు పెచ్చులూడిపోవడం జరిగింది. పంచాయతీరాజ్ అధికారులకు అడగగా తమకు తెలియదని సమాధానం చెప్పుతున్నారు.

బి. మిన్నారావు, సర్పంచ్
జి.శివడ గ్రామపంచాయతీ.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రి కొడుకులు రామయ్య, పవన్

యాత్రకు వెళ్లి వస్తూ...
రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు దుర్మరణం

ప్రజాశక్తి - బలిజిపేట

యాత్రకు వెళ్లి వస్తూ మరికొద్ది సేపటికీ ఇంటి చేరుకుంటామనుకున్న ఆ తండ్రీ కొడుకు రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువాతపడ్డ విషాదకర సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి...

మండల కేంద్రమైన బలిజిపేట గొల్ల వీధికి చెందిన ముడుసు రామయ్య (32), అతని కుమారుడు పవన్ (3) ఆదివారం శ్రీకాకుళం జిల్లా గార మండలం వత్సవలసలో జరిగిన రాజులమ్మ యాత్రకు తమ సొంత ఆటో వెళ్లారు. యాత్ర ముగించుకొని రామయ్య తన కొడుకును ఒడిలో కూర్చొండబెట్టుకొని ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. మరికొద్ది సేపటికి ఇంటికి చేరుకుంటామన్న సమయంలో తెర్లాం మండలం కొల్లివలస మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈసంఘటనలో రామయ్య, పవన్ అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే బస్సు ప్రయాణికులు ఆటోలో చిక్కుకున్న తండ్రీ కొడుకులను అతికష్టమ్మీద బయటకు తీశారు. విషయం తెలుసుకున్న బలిజిపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బలిజిపేటలో విషాద ఛాయలు

రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు మృతి చెందడంతో బలిజిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. రామయ్యకు భార్య భవాని, కుమార్తె రమ్య ఉన్నారు. భర్త, కుమారుడు మృతి చెందాడన్న వార్త విన్న భవానీ కన్నీరుమున్నీరై రోధించింది.

మలేరియా నియంత్రణపై ప్రత్యేక దృష్టి

వేసవి వడగాల్పులపై అవగాహన కల్పిస్తున్నాం
'ప్రజాశక్తి'తో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావుతో ముఖాముఖి

మన్యం జిల్లాలో మలేరియా కేసుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు చెప్పారు. వేసవిలో ప్రజలు వడదెబ్బలకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్యసిబ్బందితో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే జిల్లాలో వైద్యపరంగా చేపడుతున్న కార్యక్రమాలను ఆయన 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు.
- ప్రజాశక్తి, పార్వతీపురం



జిల్లాలో మలేరియా నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

మన్యం జిల్లాలో మలేరియా నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాం. జూన్ నుంచి డిసెంబర్ వరకు మలేరియా కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. దోమల నివారణకు మే నెల 1 నుంచి స్ప్రేయింగ్ మొదలు పెట్టనున్నాం. జిల్లాలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యే 800 గ్రామాలను గుర్తించాం. నాలుగు లక్షల దోమ తెరల కోసం ప్రతిపాదనలు పంపించాం. మూడు రౌండ్ల పిచికారీ చేయాలని నిర్ణయించాం. యాంటీ లార్వా ఆపరేషన్ మలేరియా నియంత్రణకు చర్యలు చేపడతాం.

గత ఏడాది ఎన్ని మలేరియా కేసులు నమోదయ్యాయి? గిరిజన ప్రాంతాల్లో నియంత్రణ కు ఎలాంటి చర్యలు చేపడతారు?

గత ఏడాది లో సుమారు 2వేల మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇంతవరకు 640 కేసులు నమోదయ్యాయి. గిరిజన ప్రాంతాల్లో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతిగృహాల్లో పిచికారీ చేపడతాం. ఈనెల 24 నుంచి వేసవి సెలవులు కావడంతో పాఠశాలలు, వసతిగృహాల్లో పిచికారీ చేస్తాం. కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయిస్తాం.

వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వడగాల్పులపై అవగాహనకు ఎలాంటి చర్యలు చేపడతారు?

వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నందున వడగాల్పుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వడగాల్పులకు గురయ్యే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు బెడ్‌లను కేటాయించాం. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో, అంగన్వాడీ కేంద్రాల్లో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా వుంచాం. ఉపాధి హామీ పథకం కింద పనులు ఉదయం పది లోగా పూర్తి చేయాలని సూచించాం. జిల్లాలో ప్రస్తుతం రెండు లక్షల ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయి. మరో ఏడు లక్షల ప్యాకెట్లకు ప్రతిపాదనలు పంపించాం. స్వచ్ఛంధ సంస్థలతో మాట్లాడి ప్రధాన కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో ఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లు ఉన్నాయి?

జిల్లాలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ పిహెచ్ సిలు, 282 హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి కొత్త భవనాలు నిర్మాణమయ్యాయి. కొన్ని చోట్ల అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. జిల్లాలో 8 చోట్ల బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ల నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో చర్యలు చేపట్టారు. రూ.50లక్షలతో ఒక్కో యూనిట్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ పర్యవేక్షణలో వీటి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.

పిహెచ్‌సిల్లో మందుల నిల్వకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల నిల్వకు త్రీ ఫేజ్ కరెంట్ అవసరమని రాష్ట్ర వైద్య ఆరోగ్య కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం. టూ ఫేజ్ కరెంట్ వల్ల కొన్ని మందులు పాడయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితి గతంలో గురివినాయుడు పేట, నీలకంఠాపురం పిహెచ్‌సిల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పిహెచ్‌సిలకు త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా కోసం రూ.1.24 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

జిల్లాలో ఎన్ని అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి?

జిల్లాలో 108 వాహనాలు 17 వున్నాయి. ఇవేకాక కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ కింద జిల్లాకు కేటాయించిన ఐదు అంబులెన్సు లను తాటికొండ, దుడ్డుకల్లు, నీలకంఠాపురం, తోణాం, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించాం.

జిసిసి లక్ష్యాల మేరకు ఉత్పత్తుల కొనుగోలు

డివిజినల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

నిర్దేశించిన లక్ష్యాల మేరకు జిసిసి అటవీ, వ్యవసాయ ఉత్పత్తు లను కొనుగోలు చేస్తున్నట్లు డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ చెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సాలూరు, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం బ్రాంచ్ ల ద్వారా అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రూ.2.12 కోట్ల అటవీ ఉత్పత్తులు, రూ.13.75 కోట్ల వ్యవసాయ ఉత్పత్తులను ఇంతవరకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. గత ఏడాదిలో అటవీ ఉత్పత్తుల కొనుగోలు ధర కంటే ఈ ఏడాదిలో పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని చెప్పారు. చింతపండు ధర కిలో రూ.36కు పెంచినట్లు తెలిపారు. ఈ ఏడాది చింతపండు దిగుబడి గణనీయంగా తగ్గినందున నిర్దేశించిన లక్ష్యం మేరకు కొనుగోలు చేయలేదన్నారు. గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన సరుకులకు వెంటనే డబ్బులు చెల్లిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధరకు ఎవరైనా కొనుగోలు చేస్తే గిరిజనులు విక్రయించుకోవచ్చునని చెప్పారు. కొనుగోలు చేసిన అటవీ ఉత్పత్తులను టెండర్ల ద్వారా విక్రయిస్తామని, ప్రతి 15రోజులకు ఒకసారి టెండర్ ప్రక్రియ నిర్వహిస్తామని చెప్పారు. ఇంత వరకు పిక్కతో ఉన్న చింతపండు 3146 క్వింటాళ్లు, పిక్క తీసిన చింతపండు 316.62 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు డిఎం మహేంద్ర కుమార్ తెలిపారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రామస్వామి డిమాండ్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మధ్యలో పనులు నిలిపివేయడంతో అధ్వానంగా తయారైన రోడ్డు

ప్రధాన రహదారుల మరమ్మతులకు గురైన రోడ్ల పనులను ప్రారంభించి మధ్యలో నిలిపివేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామస్వామి అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్‌తో కలిసి ఆదివారం అడ్డాపుశిల ప్రధాన రహదారి నుండి తోటపల్లి రిజర్వాయర్, ఉల్లిబద్ర, ఎర్రన్నగుడి జంక్షన్ పైబడి వరకు గల రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.రామస్వామి మాట్లాడుతూ అడ్డాపుశిల ప్రధాన రహదారి నుంచి ఎర్రన్నగుడి జంక్షన్ పైబడి వరకు రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయని, నిర్మాణ పనులు చేపట్టేందుకు పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేయడం అన్యాయమని మండిపడ్డారు. రోడ్లు, భవన నిర్మాణ శాఖ అధికారులు రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్లు నిర్మాణ పనుల కోసం బూడిద కంకరాళ్లు వేయడంతో దాని ద్వారా వచ్చే దుమ్మూ ధూళి వల్ల పాదచారులకు, వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. వాహనాల వేగం వల్ల రాళ్లు ఎగురుకుంటూ ప్రయాణికులపై పడే ప్రమాదం గతంలో జరిగిందని, దీనివల్ల అనేక మంది గాయాలపాలైనట్టు స్థానిక వ్యాపారస్తులు తెలిపారని అన్నారు. వాహనాల రాకపోకల వల్ల దుమ్మూ, ధూళి పెరగడంతో ఎదురుగావచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి లేదని, దానివల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉండదని వివరించారు. కావున వెంటనే ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నాటి వైసిపి ప్రభుత్వ హయాంలో రోడ్లు గుంతలుగా తయారవ్వడంతో, అధికారం చేపట్టిన వెంటనే ప్రతి రోడ్డు మరమ్మతులు చేపట్టి, సుందరంగా తీర్చిదిద్దుతామని నేటి టిడిపి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ దాన్ని పూర్తిగా విస్మరించిందని వాపోయారు. కావున వెంటనే జిల్లా అధికారులు ప్రధాన రహదారులపై దృష్టి సారించి, బడ్జెట్లలో అత్యధిక నిధులను కేటాయించి, రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సిహెచ్‌డబ్ల్యులకు ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఉపాధి పనులు కల్పించేలా వెసులుబాటు కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన జిల్లా వ్యాప్తంగా వందలాది మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా పనిచేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదన్నారు. రోజురోజుకు రాజకీయ వేధింపులు పెరిగే పరిస్థితి ఉందన్నారు. అయితే నిరంతరం ప్రజలకు వైద్యసేవలందించే వీరి బాగోగులను పట్టికొనే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.4వేలు వేతనంతో కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. కావున కనీస వేతనం రూ.26వేలైనా ఇవ్వాలని,, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపు ఆపాలని కోరారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఉపాధి పనులు కల్పించేలా విసులుబాటు కల్పించాలని కోరారు. విలేకరుల సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల మండల నాయకులు కె.దుర్గ పాల్గొన్నారు.

వెంకంపేటలో జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేటలో పారిశుధ్య కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. ఆదివారం వైకెఎం నగర్, మజ్జి గౌరీ హౌసింగ్ కాలనీ, శక్తి నగర్ ప్రాంతాల్లో సర్పంచి తీళ్ళ కృష్ణారావు, మాధవ ఆధ్వర్యంలో రహదారులకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలను ప్రొక్లైనర్లతో తొలగించి కాలువలను పరిశుభ్రం చేశారు. గ్రీన్ అంబాసిడర్లు పంచాయితీ సిబ్బంది కాలనీలో ఇంటింటికి వెళ్లి వ్యర్థాలను రహదారులపై వేయకుండా సహకరించాలని కోరారు.

విలేకరులు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
విజయనగరం, గరివిడి, సంతకవిటి, సాలూరు, జియ్యమ్మవలస, గజపతినగరం రూరల్, కొత్తవలసరూరల్, పాలకొండ రూరల్
ఇంటర్వ్యూ : తేది: 18-04-24 శుక్రవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099164, 9490099156, 8331011960
ప్రజాశక్తి కార్యాలయం
అశోక్ బంగ్లా ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం

పాలిటెక్నిక్‌తో విస్తృత ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పదో తరగతి తర్వాత సాంకేతిక విద్యతో పాటు, విస్తృత ఉపాధి అవకాశాలు పొందేందుకు పాలిటెక్నిక్ డిప్లమో కోర్సు ఎంతో అనువైందని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో టెన్త్ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారు ఈనెల 15తో దరఖాస్తు గడువు ముగియనున్న పాలిసెట్ అనబడే పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యేందుకు ఆఖరు తేదీ. ఈనెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 30న ప్రవేశ పరీక్ష జరగనుంది. మూడేళ్ల పాలిటెక్నికల్ కోర్సు చేసిన వారికి దాదాపు 80 శాతం వివిధ ప్రభుత్వ ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. జిల్లాలో నాలుగు ప్రభుత్వ,

పాలీసెట్ పరీక్ష విధానం

పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఎపి పాలీసెట్లో 120 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు. పదో తరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు వస్తాయి, సెక్షన్ ఎ-మేథ్స్ 50, సెక్షన్-బి ఫిజిక్స్ 40, సెక్షన్-సి కెమిస్ట్రీ 30 ప్రశ్నలు ఉంటాయి.

30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

మూడు ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలలు ఉండగా, అందులో 10 బ్రాంచీలకు గాను 600 సీట్లు ఉన్నాయి. పార్వతీపురం ఎంఆర్ నగరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, సీతంపేట కళాశాలలో సివిల్, మెకానికల్. గుమ్మలక్ష్మీపురం కళాశాలలో సివిల్, మెకానిక్, ఎలక్ట్రికల్, చినమేరంగి కళాశాలలో సివిల్, మెకానిక్, ఎలక్ట్రికల్ కోర్సులు ఉన్నాయి. ఈనెల 30న జరిగే పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షలో మంచి మార్కులు సాధించగలిగితే కోరుకున్న కళాశాలలో కోరుకున్న బ్రాంచ్‌ల్లో సీట్లు పొందే అవకాశం ఉంది. టెన్త్ తర్వాత త్వరగా ఉపాధి అవకాశాలు పొంది చిన్న వయసులోనే ఉద్యోగాలు పొందేందుకు పాలిటెక్నికల్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని, అంతేకాకుండా ఈ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత మూడేళ్లు ఇంజినీరింగ్ కోర్సులు చేసి ఇంజనీరింగ్ పట్టభద్రులు కావచ్చునని పార్వతీపురం ఎమ్మార్ నగరం ప్రిన్సిపల్ విలియం కేరి తెలిపారు. ఆసక్తి గలవారికి పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచితంగా శిక్షణా తరగతులు కూడా

పార్వతీపురంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీ

ప్రారంభమయ్యాయని, ఈనెల 29 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉదయం 10 నుండి 1గంట వరకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ నిర్వహించడమే కాకుండా, స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు వెంటనే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకొని సమీప పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డిఎస్‌పి రాంబాబు

క్రీడలతో మానసిక ఉల్లాసం : డిఎస్‌పి

ప్రజాశక్తి - సీతంపేట

క్రీడలతో మానసిక ఉల్లాసం ఉంటుందని పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. మండలంలోని ధోనుబాయి పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం వల్ల మారుమూలలనున్న యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయడానికి వేదికవుతుందన్నారు. వాలీబాల్ వల్ల శరీరం ఫిట్నెస్‌గా ఉంటుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో చుట్టుపక్కల గ్రామాల నుంచి 40 టీములు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు టోర్నమెంటు జరుగుతుంది. వీటిలో ఆదివారం, సోమవారం, గురువారం మూడు రోజులు పాటు జరుగుతుంది. పోలీసులు క్రీడాకారులకు తాగునీరు కల్పించారు. కార్యక్రమంలో పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ఎస్‌కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు నాయుడు

స్టేషన్ రోడ్డులో పేదలకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉండే పేదలకు నివాసం ఉన్న స్థలాలకు పట్టాలు ఇచ్చి భద్రత కల్పించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, రైల్వే స్టేషన్ రోడ్డు పేదల సంఘం ప్రతినిధులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా పట్టణ పౌర్ణ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారి ఆదేశాల ప్రకారం రైల్వే స్టేషన్ రోడ్డులో గల అక్కడే నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇప్పించాలని, అక్కడే వారికి శాశ్వత నివాసం ఉండేలా వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం స్థానిక తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ తగు చర్యలు తీసుకొని అక్కడ ఉండే పేదలందరికీ పట్టాలు ఇప్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎన్‌వై నాయుడు, డివైఎఫ్ఐ నాయకులు, రైల్వే స్టేషన్ రోడ్డు పేదల సంఘం నాయకులు ఇ.నారాయణమ్మ, డి.అరుణ, పి.సరోజిని, వి.ఈశ్వరమ్మ, బి.జ్యోతి, జి.పూర్ణిమ, కె.సంధ్య పాల్గొన్నారు.

మోడల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- భామిని

స్థానిక మోడల్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలియజేశారు. ఫస్ట్ ఇంటర్ ఎంపిసిలో బూరాడ హారిక 453 మార్కులు, బైపిసిలో ఆయిక విజయ 432, సిఇసిలో బౌరీ సంజన 434 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో గవర సాయిగీత 972, బైపిసిలో ముర్ల తేజస్విని 937, సిఇసిలో దామోదర సౌమ్య 898 మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

ఘనంగా మట్టల పండగ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక తెలుగు బాప్టిస్ట్ దేవాలయం ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా పిల్లలు, యువతీ, యువకులు, వృద్ధులు మొదలుకొని ర్యాలీగా వెళ్లి ప్రభువు పేరిట వచ్చేవాడు స్తుతింపబడిన గాక, హోసన్నా జయం జయం నినాదం చేశారు. కార్యక్రమంలో ఆలయ పాస్టర్ వి శంకర్, అధ్యక్షులు కలింగ ప్రేమభూషణరావు, కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పిల్ల కాలువలా ఉన్న బట్టిగూడ గిరిజన గ్రామ రహదారి

కాలువ అనుకుంటే పొరపాటే..!

ప్రజాశక్తి - వీరఘట్టం

కాలువ అనుకుంటే పొరపాటునండి... మండలం మూలలంక పంచాయతీ పరిధి మూలలంక గిరిజన గ్రామం నుంచి బట్టిగూడకు వెళ్లే రోడ్డు పంట పిల్ల కాలువలా దర్శనమిస్తుంది. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారిపై వర్షం నీరు పారడంతో పిల్ల కాలువల తయారైందని గిరిజనులు వాపోతున్నారు. రహదారి ఈ స్థితిలో ఉండడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు బాగోకపోవడంతో తమ గ్రామాలకు 108,104 వాహనాలు వచ్చే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణమూర్తికి సేవాశ్రీ పురస్కారం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తికి సేవాశ్రీ పురస్కారాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అందజేశారు. కృష్ణమూర్తి సామాజిక రంగంలో విస్తృతంగా సేవలు అందిస్తున్నందుకు గాను మంచిపల్లి సాహితీ లహరి సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ పరిష్కారాన్ని అందజేశారు. ఆదివారం స్థానిక సూర్యా పీఠంలో ఈ పురస్కారాన్ని అందజేస్తూ, ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

కృష్ణమూర్తికి సేవాశ్రీ అందజేస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు, కలెక్టర్

అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కూటమి ప్రభుత్వ హయాంలో కురుపాం నియోజకవర్గంలో తాను చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక వైసిపి నాయకులు, మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రశాంతమైన వాతావరణంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని ప్రభుత్వం విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హెచ్చరించారు. గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రచారమాధ్యమాల్లో తప్పుడు పోస్టింగులు పెడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. కోట్లాది రూపాయలతో ఉన్న ఆస్తులు తనవేనని చెప్పి ఇంత తప్పుడు ప్రచారం ఏమిటమన్నారు. చంటి అనే వ్యక్తి మీ మనిషి కాదా? వైసిపి కాదా, వైసిపి పెంచి పోషించిన మనిషి జనసేనలోకి వస్తే అది చూసి ఓర్వలేక అవాస్తవంగా మాట్లాడడం తగదన్నారు. పదేళ్ల పాటు ప్రజలు అవకాశం ఇస్తే అంతా కక్ష సాధింపుతోనే పని చేశారా తప్ప ఎక్కడా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గిరిజనులకు మీరు ఏ విధమైన అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కనీసం మేడ దిగి ప్రజలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు వచ్చి కల్లి బుల్లి మాటలు చెప్పి మొసలి కన్నీరు పెడితే ప్రజలు నవ్వరా అని అన్నారు. మీ పెరట్లో ఉన్న వ్యక్తి ఇద్దరు విద్యార్థినిలపై మానభంగం చేస్తే మీరు అతడ్ని కాపాడడానికి ఎంతగానో ప్రయత్నించారో మీకు తెలియదా అన్నారు. కురుపాం జ్యోతిరావు పూలే పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు పాముకాటుతో చనిపోతే బాధిత తల్లిదండ్రులు ధర్నా చేస్తే వారిని బెదిరించలేదా అన్నారు. కోట్లాది రూపాయలు ఇసుక గ్రీన్ ట్రిబ్యునల్

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవు : ఎమ్మెల్యే

కాదని చెప్పినప్పటికీ మీరు అక్రమంగా తరలించడం వాస్తవం కాదా అన్నారు. అభివృద్ధిపై ప్రశ్నించిన వ్యక్తులపై కేసులు పెట్టారని అన్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తారన్నారు. తన భర్త నాతో ఉన్నారని చెప్పి ఓటమి భయంతో సస్పెండ్ చేయించడం వాస్తవం కాదా అన్నారు. ఇవన్నీ మీరు చేసి ఎలా మర్చిపోయి మాట్లాడతారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మీరు పదేళ్లలో వేయని రోడ్లు 11 నెలల్లో వేసి చూపించామన్నారు. తోటపల్లి అదనపు ఆయకట్టు 164జిఒను మాజీ ఎమ్మెల్సీ విజయరామరాజు తీసుకొస్తే మీరు రద్దు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పూర్ణపాడు, లాభేసు వంతెన పూర్తి చేస్తామని, కుంకి ఏనుగులను తీసుకువచ్చి ఈ ప్రాంతం నుంచి అడవి ఏనుగులను తరలించి ప్రజలకు రక్షణ కల్పిస్తామని చెప్పారు. మాజీ డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి నాకేమీ తెలియదంటున్నారని, అవును తనకు దోచుకోవడం తెలియదని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి పాలన మాత్రమే తనకు తెలుసునని అన్నారు. ప్రశాంతంగా ఉన్న గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ప్రెస్ మీట్‌లు పెట్టి రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు, కురుపాం ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, టిడిపి నాయకులు కోల రంజిత్ కుమార్, శేఖర్ పాత్రుడు, అక్కేన మధు, మండంగి భూషణ, బిజెపి నాయకులు నిమ్మక సింహాచలం, అప్పలస్వామి తదితరులు ఉన్నారు.

రాజన్నదొరకు అభినందనలు తెలుపుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

రాజన్నదొరకు నాయకులు, కార్యకర్తల అభినందనలు

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి రాజకీయ సలహామండలి సభ్యునిగా మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీలో అత్యున్నత నిర్ణాయక కమిటీలో సభ్యుడిగా రాజన్నదొరకు చోటు దక్కింది. సీనియర్ ఎమ్మెల్యేగా విశేష రాజకీయ అనుభవం ఉన్న రాజన్నదొరకు పిఎసి సభ్యునిగా నియమించడంపై నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఆదివారం పట్టణ వైసిపి సీనియర్ నాయకులు గిరి రఘు, మద్దిల గోవింద రావు, మొకర లక్ష్మణరావు, హరి ఈశ్వరరావు, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, లీగల్ సెల్ నియోజకవర్గ కన్వీనర్ బంకురు రామచంద్రరావు, మాదిరెడ్డి మధుసూదనరావు, మాజీ కౌన్సిలర్లు మజ్జి అప్పారావు, జర్జాపు శ్రీనివాసరావు, మండల నాయకులు పూడి కృష్ణ చైతన్య రాజన్నదొరను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో పిఎసి సభ్యునిగా నియమించిందని, నాయకులు కార్యకర్తల సహకారంతో అధినేత జగన్ మోహన్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని చెప్పారు.

బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గ ప్రజల అవసరాలు తీర్చడమే తన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ అన్నారు. మండలంలోని వాటపాగులో 15వ ఆర్థిక సంఘం కింద ఎంపిపి నిధులతో లక్ష రూపాయల అంచనా మంచి నీటి బోరు, ఉపాధి హామీ పథకం కింద రూ.35 వేల విలువతో పశువుల నీటి తొట్టె నిర్మాణాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమైన పనులు చేపట్టి ప్రజలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపి వాకముడి అనిల్, రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ గర్భాన సత్తిబాబు వాటపాగు సర్పంచ్ వావిలపల్లి రాజారావు, మండల నాయకులు జాడ శ్రీధర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దశమంతపురంలో నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం లోని దశమంతపురంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సోమవారం నిర్వహించనున్నట్లు అంబేద్కర్ సేవా సంఘం (కెవిపిఎస్) మండల నాయకులు ఎన్.సింహాచలం ఆదివారం ప్రకటనలో తెలిపారు. విగ్రహం ఏర్పాటుకు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి విరాళం సేకరించామన్నారు. అలాగే బయట ప్రాంతాలకు వెళ్లిన యువతీ, యువకులకు, వలస వెళ్లిన ఉపాధి కూలీల నుంచి కూడా వీరంతా సమిష్టి కృషితో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు

ఆదర్శప్రాయుడు అంబేద్కర్

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థి దశలో ఎన్నో ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొన్న బిఆర్ అంబేద్కర్ జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని శ్రీ వెంకట విద్యా గిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదరికం చదువుకు ఏ మాత్రం అడ్డుకాదని అంబేద్కర్ జీవితమే ఒక నిదర్శనమని అన్నారు. చిన్నతనంలో ఎన్నో ఆర్థిక, సామజిక ఇబ్బందులు ఎదుర్కొని అత్యున్నత స్థాయికి ఎదిగిన వ్యక్తిని నేడు జాతి యావత్తు గుర్తుపెట్టుకునే స్థాయికి ఎదిగారని చెప్పారు. రాజ్యాంగ రచన చేశారని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇటువంటి మహనీయుల పుట్టినరోజు నాడు పాఠశాలలకు సెలవులు ఇవ్వకుండా ఒక పూట స్కూల్ నిర్వహించి, మహానుభావుల జయంతి, వర్ధంతులు విద్యార్థుల సమక్షంలో జరిపితే పిల్లలు ఎంతో స్ఫూర్తి పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిఇఒగా రాజ్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా విద్యాశాఖాధికారి (ఇన్‌ఛార్జి)గా బి.రాజ్‌కుమార్ నియమితులయ్యారు. రాజ్‌కుమార్ డిప్యూటీ డిఇఒగా పనిచేస్తున్నారు. గతంలో డిఇఒగా పనిచేస్తున్న తిరుపతినాయుడు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఇప్పటి వరకు కార్యాలయ ఎఒ రమాకుమారి ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.

పేదలకు చెప్పులు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొండ

సాహితీసుధ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పాలకొండ కోనేటిరాయుని చెరువుగట్టుపైన శ్రీ కోటదుర్గ డిస్ట్రిబ్యూటర్స్ యూనియన్ వారి సహకారంతో 60మంది పేదలకు గొడుగులు, పాదరక్షలు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోటదుర్గ డిస్ట్రిబ్యూటర్స్ యూనియన్ ప్రతినిధులు వారణాసి లక్ష్మణరావు, టంకాల ప్రసాద్, గుణ, లక్ష్మణరావు, పలు డిస్ట్రిబ్యూటర్ల యజమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సహకరించిన వారందరికీ ఎస్.వి.ప్రసాదరావు. తిరుమలరావు, ఉమామహేష్, చక్రవర్తి, గోవిందా, మహేష్ ధన్యవాదాలు తెలిపారు.

25 నుంచి స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 25 నుంచి మే 31 వరకు 35 రోజుల పాటు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతుల్లో చేరి తమ భవిష్యత్తును దిద్దుకోవాలని "స్పెల్" స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్సెస్ నిర్వాహకులు పి.అభిమన్యు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేటలో ఉన్న పావనీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 35 రోజులు పాటు తరగతులను నిర్వహిస్తున్నామని, ఈ మేరకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు ఈ స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాతృభాష తెలుగు, మన తల్లి దీన్ని ఎన్నడూ మరవద్దు, అలాగే మన అవసరాలను తీర్చుకునేందుకు, దేశ, విదేశాల్లో సాటి మనిషితో మాట్లాడేందుకు ఖచ్చితంగా ఇంగ్లీష భాషను నేర్చుకోవాలని, అందుకు విద్యార్థి దశలోనే పునాది పడాలన్నారు. స్పెల్ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సు (35 రోజుల ప్రోగ్రాం)లో మీ పిల్లల్ని చేర్పించాలని కోరారు. ఈ తరగతులను ఉదయం 9గంటల నుంచి 11గంట వరకు నిర్వహిస్తామని అన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు. నామమాత్రపు ఫీజు ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నెంబర్: 9490678160 సంప్రదించాలని కోరారు.

మండల టాపర్‌గా రాజేశ్వరి

కె.రాజేశ్వరి
ఎంపిసి -983

ఎస్.ఇందుమతి
ఎంపిసి -981

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీ గాయత్రీ కళాశాలకు చెందిన కె.రాజేశ్వరి ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో 983 మార్కులు సాధించి వీరఘట్టం మండలం టాపర్‌గా నిలిచినట్లు కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఎస్.లోకేష్, ఎన్ సింహచలం తెలిపారు. అలాగే ఎస్.ఇందుమతి ద్వితీయ ఎంపిసిలో 981 కళాశాలకు టాపర్‌గా నిలిచింది. ద్వితీయ బైపిసిలో బి.సీతారాం 930, కె.సుస్మిత 929 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో కె.యమున 446, వి.శిరీష 440, బైపిసిలో అంబల లక్ష్మీ హర్షిత 408 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం 67 మంది విద్యార్థులకు గాను 65 మంది, ద్వితీయ సంవత్సరానికి 97 మందికి గాను 94 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఇంతటి ప్రభంజనం సృష్టించినందుకు కరెస్పాండెంట్, ప్రిన్సిపల్, అధ్యాపకులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గొట్టమంగళాపురంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో కిమ్స్ శ్రీకాకుళం వారి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. సుమారు 130 మంది వైద్యం చేయించుకున్నారు. వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులు సరఫరా చేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహణలో మజ్జి వీర నాయుడు, బబ్బాది శివ, గొర్లి రవి, బి.బాష తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం సబ్ ట్రెజరరీ పరిధిలో గల రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్ దారుల సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని ఆ సంఘ జిల్లా కార్యదర్శి డి.గణపతి రావు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. స్థానిక రైతు బజార్ వెనుక ఉన్న ప్రభుత్వ పెన్షన్ దారుల సమావేశ మందిరంలో జరుగు ఈ సమావేశానికి రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదార్లంతా తప్పక హాజరుకావాలని కోరారు.

గోమరణాలపై వైసిపి అసత్య ప్రచారం : టిడిపి

ప్రజాశక్తి - సీతంపేట

టిటిడిలో గోమరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పడాల భూదేవి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. టిటిడి గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తమని అన్నారు. అసత్య ప్రచారం చేస్తూ టిటిడి ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు ఎం.మోహన్‌రావు, మాజీ ఎంపిపి సవర కుంపి, బిడ్డక జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - కొమరాడ

లారీ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం కొమరాడలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కొమరాడ అంతర్ రాష్ట్ర రహదారిపై రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ కొమరాడ మండలం కొత్తవలసకు చెందిన బిడ్డికి లక్ష్మణ్ (55)ను రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. దీంతో వెనుక చక్రాల కింద లక్ష్మణ్ పడిపోవడంతో శరీరమంతా పూర్తిగా నుజ్జు అయ్యిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే మతి చెందిన వ్యక్తి ఎవరో గుర్తుపట్టలేనంత విధంగా మృతదేహం నిలిగిపోయింది. కొద్దిసేపటికి వివరాలు ఆధారంగా కొత్తవలస గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రమాదాన్ని గ్రహించిన లారీ డ్రైవర్ పోలీసులకు లొంగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు.

రోడ్డు ప్రమాదాలకు కారణం ఇరుకు రహదారులే..

కొమరాడ మండలంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఆనుకుని ఉన్న పలు గ్రామాల వద్ద ఇరుకు రహదారులే ప్రమాదాలకు కారణం అవుతున్నాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కూడా ఈరుకు రహదారుల వల్ల రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఇలా అనేకమార్లు ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. ముఖ్యంగా కొమరాడ మండల కేంద్రంలో ఒకవైపు ఆటోలు రోడ్డుపైనే పార్కింగ్ చేసి ఉండడంతో వచ్చిన భారీ లారీలు సైతం నచ్చిన విధంగా రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శివిని, విక్రాంపురం, అర్తం, గంగరేగు వలస, గుమడ , కొమరాడ గ్రామాల వద్ద అంతరాష్ట్ర రోడ్డు ఇరుగ్గా ఉండడంతో నిత్యం ఇలా రోడ్డు ప్రమాదం బారిన పడి మృతి చెందుతున్నారు. ఎప్పటికైనా ఆయా గ్రామాల వద్ద రహదారి వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఇష్టానికి గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.